సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 9 । అక్టోబర్ । 2024



గునసెల్మ గిరిజనుల ఆదర్శం

అధ్వాన రహదారికి శ్రమదానంతో మరమ్మతులు చేపట్టి గునసెల్మ గిరిజనులు ఆదర్శంగా నిలిచారు. IIలో



కాఫీ రైతుల సంక్షేమమే లక్ష్యం

కాఫీ రైతులు సంక్షేమమే లక్ష్యమని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ అన్నారు. IIలో



ఇంద్రకీలాద్రికి భవానీల పాదయాత్ర

రంపచోడవరం: ఇక్కడికి చెందిన భవానీలు పాదయాత్రగా మంగళవారం విజయవాడ ఇంద్ర కీలాద్రికి బయలుదేరారు.

సమ్మెకు సై



ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సాగవుతున్న కాఫీ తోటల్లో పనిచేస్తున్న కార్మికులు సమ్మెకు సిద్ధపడుతున్నారు. ఈనెల 15లోగా తమ సమస్యలు పరిష్కరించకుంటే విధులకు రాబోమని ప్రకటించారు. యాజమాన్యం స్పందించకుంటే కొద్దిరోజుల్లో సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభం కానున్న కాఫీ పండ్ల **సేకరణపై తీవ్ర ప్రభావం చూపనుంది.**

- సిద్ధపడుతున్న ఏపీఎఫ్‌డీసీ కాఫీ కార్మికులు
- ఈనెల 15లోగా సమస్యలు పరిష్కరించాలని అల్టిమేటం
- లేదంటే విధులకు రాబోమని హెచ్చరిక
- యాజమాన్యం స్పందించకుంటే నిలిచిపోనున్న కాఫీ పండ్ల సేకరణ



చాపగెడ్డలో మరమ్మతుకు నోచుకోని ఏపీఎఫ్‌డీసీ కాఫీ కార్మికుడి నివాస గృహం

చింతపల్లి: ఏపీఎఫ్‌డీసీ సంస్థకు సంబంధించి మినుములూరు, అనంతగిరి, చింతపల్లి, ఆర్‌వీ నగర్ డివిజన్ల పరిధిలో 4,010 హెక్టార్లలో కాఫీ తోటలు ఉన్నాయి. వీటిలో పనుల ద్వారా ఒకప్పుడు 1500 మంది కార్మికులు ఉపాధి పొందేవారు. ఇప్పుడు వీరి సంఖ్య 500కు తగ్గిపోయింది. బర్మా నుంచి వచ్చిన కాందిశీకుల కుటుంబాలు కూడా వీటిలో ఉన్నాయి. వీరికి చాపగెడ్డ, ఎర్రవరం, మినుములూరు, లంకపాకలు తదితర ప్రాంతాల్లో ఉపాధితో పాటు క్వార్టర్లు ఏర్పాటుచేశారు. వీటికి మరమ్మతులు చేపట్టని కారణంగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎరువుల వేత, కాఫీ కొమ్మల కత్తిరింపు, యాజమాన్యం, పండ్ల సేకరణ తదితర పనుల ద్వారా కార్మికులు ఉపాధి పొందుతున్నారు. 2002 తరువాత వీరంతా సంఘంగా ఏర్పడ్డారు. కార్మికుడికి తొలుత కిలో కాఫీ పండ్ల సేకరణకు రూ.1.25, యాజమాన్య పనులకు రోజు కూలీ రూ.65 ఆంధ్ర ప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ చెల్లించేది. ఇప్పుడు

కిలో పండ్లసేకరణకు రూ.5.25, రోజు కూలీ రూ.320 ఇస్తోంది. ఆ సంస్థ ఆదాయ సముపార్జనలో కీలకపాత్ర పోషిస్తున్న తమకు కార్మిక చట్ట ప్రకారం అన్ని సౌకర్యాలతోపాటు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో నిర్దయం ప్రకటించకుంటే సమ్మెకు వెనుకాడేది లేదని హెచ్చరిస్తున్నారు.

డిమాండ్లు ఇవీ..

- కాఫీ కార్మికులకు, పెరిగిన కరువు భత్యం చెల్లించాలి.
- వీడీఏ పాయింట్లకు కూలి, పండ్ల సేకరణ రేట్లు పెంచాలి.
- నెలలో 26 రోజులు పూర్తిస్థాయిలో పనులు కల్పించాలి.
- **శాశ్వత కాఫీ కార్మికుల క్వార్టర్లకు మరమ్మతులు చేపట్టాలి.**
- **సురక్షిత తాగునీటి సౌకర్యం కల్పించాలి**
- **పర్మినెంట్ కార్మికుల పిల్లల చదువుకు ఆర్థిక సహకారం అందించాలి.**
- **పండగ అడ్వాన్సులు ఇవ్వాలి.**
- **తోటల్లో ప్రమాదాలు జరిగితే చికిత్స ఖర్చు భరించాలి.**
- సంస్థ పరిరక్షణకు 300 మంది ప్లాంటేషన్ కండక్టర్లను నియమించాలి.
- ప్లాంటేషన్ వర్కర్లు 18 మందికి, నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి.
- ఏపీఎఫ్‌డీసీ సంస్థ పరిరక్షణకు బడ్జెట్లో నిధులు ప్రత్యేక నిధులు కేటాయించాలి.

15న నోటీసు ఇస్తాం



కాఫీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 15వ తేదీన సమ్మె నోటీసు ఇస్తాం. ఈలోగా పరిష్కారానికి యాజమాన్యం ముందుకు రాకుంటే సమ్మె చేసేందుకు ఏమాత్రం వెనుకాడేది లేదు. కాఫీ కార్మికుల సమస్యలు యాజమాన్యం ఏనాడూ ముందుకొచ్చి పరిష్కరించలేదు. కార్మికుల పట్ల చులకన భావమే ఇందుకు కారణం.

– బోనంగి చిన్నయ్యపడాల్, జిల్లా అధ్యక్షుడు, కాఫీ కార్మిక సంఘం, పాడేరు

పూట గడవక ఇబ్బందులు



శ్రీలంక నుంచి మా కుటుంబాలను ఇందిరాగాంధీ హయాంలో కాఫీ తోటల్లో పనుల నిమిత్తం తీసుకువచ్చారు, నాడు నివాస గృహాలతో పలు సౌకర్యాలు కల్పించారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో పనులు లేక పూట గడవక ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. పర్మినెంట్ కార్మికులుగా చెబుతున్నా మా సమస్యలన్లు యాజమాన్యం పట్టించుకోవడం లేదు.

– నల్ల సెల్వం కనకవల్లి, కాందీశీకురాలు, వంగసార కాఫీ ప్లాంటేషన్

న్యూస్‌రీల్

హైకోర్టు జడ్జి చాపరాయి సందర్శన



చాపరాయి పగోడా గార్డెన్ వద్ద జస్టిస్ రవినాథ్ తిల్హారి



జడ్జి దంపతుల ముందు థింసా నృత్యం చేస్తున్న గిరిజన కళాకారులు

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలవిహారిని హైకోర్టు జడ్జి జస్టిస్ రవినాథ్ తిల్హరీ దంపతులు వారి కొడుకు కోడలు కుటుంబ సమేతంగా సందర్శించారు. గిరి మహిళల సంప్రదాయ థింసా నృత్యాన్ని తిలకించారు. ప్రకృతి అందాలకు మంత్రముగ్ధులయ్యారు. ఎస్‌ఐ పాపినాయుడు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

హైవే బాధితుల సమస్యలు పరిష్కరించాలి

- రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



మాట్లాడుతున్న పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం: జాతీయ రహదారి 516ఈ నిర్మాణం వల్ల నష్టపోయిన బాధితుల పెండింగ్ సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం సబ్‌కలెక్టర్ కల్పశ్రీతో కలిసి తహసీల్దార్లు, అటవీ అధికారులు, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ రంపచోవరం మండలం నుంచి రాజవొమ్మంగి మండలం వరకు నేషనల్ హైవే రోడ్డుకు ఇరువైపులా భూములు, ఇళ్లు, చెట్లు కోల్పోయిన బాధితుల పెండింగ్ సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటి వరకు ఎంత మంది బాధితులకు అవార్డు ఇచ్చింది.. మంజూరు చేయాల్సిన వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అడ్డతీగలలోని పెట్రోల్ బంక్, హార్టికల్చర్, ఏపీఈపీడీసీఎల్‌లకు సంబంధించిన విషయాలపై చర్చించారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ప్యాకేజీ అమలు చేసిన వివరాలపై ఆరా తీశారు. హైవే నిర్మాణానికి కేటాయించిన ప్రభుత్వ భూమి, ప్రైవేట్ భూమి వివరాలను ఆమె అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు కరక సత్యనారాయణ, సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రాన్ని తరలిస్తే ఆమరణ నిరాహార దీక్ష చేస్తా

- పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లా ఏర్పాటు చేసిన వైఎస్ జగన్
- గిరిజనులు అంటే చంద్రబాబుకు **ఏ మాత్రం గిట్టదు**
- **పాడేరు ఎమ్మెల్యే**, వైఎస్సార్‌సీపీ జిల్లా **అధ్యక్షుడు** మత్స్యరాస విశ్వేశ్వరరాజు



మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రాన్ని **పాడేరు నుంచి** మైదాన ప్రాంతానికి తరలించేం**దుకు ప్రయత్నిస్తే** ఆమరణ నిరాహార దీక్షకు దిగు**తానని పాడేరు** ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా **అధ్యక్షుడు మత్స్య**రాస విశ్వేశ్వరరాజు హెచ్చరించారు. **మంగళవారం** ఆయన పాడేరులోని తన **క్యాంప్ కార్యాలయం**లో మీడియాతో మాట్లాడారు. **దశాబ్దాల** తరబడి ఎటువంటి అభివృద్ధికి **నోచుకోకుండా,** పూర్తిగా నిరాదరణకు గురైన గిరి**జనం, గిరిజన** ప్రాంతం కోసం గత ముఖ్యమం**త్రి, వైఎస్సార్‌సీపీ** అధినేత వైఎస్ జగన్‌మోహన్ **రెడ్డి అల్లూరి** సీతారామరాజు పేరిట జిల్లాను **ఏర్పాటు చేశారని** తెలిపారు. గిరిజనం అంటే ఏ **మాత్రం గిట్టని** చంద్రబాబు జిల్లా కేంద్రాన్ని **పాడేరు నుంచి** మైదాన ప్రాంతానికి తరలిస్తున్నారనే ఊహాగానాలు అధికమయ్యాయన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాల పునర్విభజన పేరిట పాడేరు కేంద్రంగా ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లాను నర్సీపట్నానికి తరలిస్తున్నారని పలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్న వార్తలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశం గిరిజనులను కలవరపాటుకు గురి చేస్తోందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి స్పష్టత ఇవ్వాలన్నారు. ఇప్పటికే గిరిజన ప్రాంతం అభివృద్ధికి దూరంగా ఉందని, జిల్లా ఏర్పాటుతో పాడేరు, అరకువ్యాలీ, రంపచోడవరం నియోజకవర్గాల్లో గిరిజనం ఎంతో సంతోషించారన్నారు. కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్ సహా ఇతర జిల్లా స్థాయి నాయకులంతా అందుబాటులో ఉండటంతో తమ సమస్యలు పరిష్కారమవుతాయని గిరిజనులు భావిస్తున్నారన్నారు. ఈ సమయంలో ఇలాంటి వార్తలు సృష్టించి గిరిజనుల్లో అనుమానాలు రేకెత్తిస్తున్నారని మండిపడ్డారు. ఒకవేళ జిల్లా తరలింపు అనివార్యం అయితే గిరిజనుల పక్షాన వైఎస్సార్‌సీపీ నిలబడి భారీ ఎత్తున ఉద్యమిస్తుందన్నారు. స్థానికంగా తమతో కలిసివచ్చే రాజకీయ పార్టీలు, ప్రజా, గిరిజన సంఘాలు, స్థానిక గిరిజనులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, ఏఎంసీ చైర్మన్ కూతంగి సూరిబాబు, పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి లకే రామసత్యవతి, ఎంపీటీసీలు రామకృష్ణపాత్రుడు, కుంతూరు నర్సింహమూర్తి, సల్లా చిట్టమ్మ, సర్పంచ్‌లు వనుగు బసవన్నదొర, కుర్రబోయిన సన్నిబాబు, వంతాల రాంబాబు పాల్గొన్నారు.

పెదబయలు విద్యుత్ సబ్‌స్టేషన్ తనిఖీ

పెదబయలు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పాడేరు ఈఈ ఆనంద మురళి మంగళవారం తనిఖీ చేశారు. కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న ఫీడర్ లైన్లు, సబ్ స్టేషన్‌లో ఏబీ స్విచ్‌లు, సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. పీవీటీసీ గ్రామాల్లో లబ్ధిదారులకు మీటర్లు అమర్చడం, విద్యుత్ స్తంభాల ఏర్పాట్లపై ఆరా తీశారు. వర్షాలు, విపత్తు సమయాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఏఈ రామన్న, సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

మరమ్మతు పనుల్లో నాణ్యత లోపిస్తే సహించం



పనుల వివరాలను తెలుసుకుంటున్న ఏపీటీడీసీ చైర్మన్ బాలాజీ



థింసా నృత్యాలను తిలకిస్తున్న బాలాజీ, తదితరులు

- రూ.19 కోట్లతో మరమ్మతు పనులు
- రాష్ట్ర ఏపీటీడీసీ చైర్మన్ బాలాజీ

అరకులోయ రూరల్: మండల కేంద్రం అరకులోయలోని ఏపీ టూరిజం మయూరి, హరిత అతిథి గృహాలకు జరుగుతున్న మరమ్మతు పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ బాలాజీ హెచ్చరించారు. రూ.19 కోట్ల వ్యయంతో జరుగుతున్న మరమ్మతులను మంగళవారం ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యత పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ.కోట్లతో చేపడుతున్న పనుల్లో తప్పని సరిగా నాణ్యత పాటించాలన్నారు. పనుల్లో కొత్తదనం కనిపించాలని, సందర్శకులను ఆకట్టుకునేలా ఉండాలని ఆదేశించారు. అరకులోయ పర్యాటక కేంద్రం కావడంతో రెస్టారెంట్, బార్ అన్ని రకాల సౌకర్యాలతో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పర్యాటకుల సౌకర్యార్థం అతిథి గృహాలు ఉన్నప్పటికీ వాటి వినియోగం ఆశించిన స్థాయిలో లేదన్నారు. సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో పర్యవేక్షణపై దృష్టి సారించాలన్నారు. అనంతగిరి మండల కేంద్రంలో ఉన్న పాత టూరిజం అతిథి గృహం నిరుపయోగంగా మారిందని వాటిని త్వరలోనే వినియోగం లోకి తీసుకువస్తామన్నారు. నూతన ఫర్నిచర్, ఆధునిక విద్యుత్ లైట్లు సందర్శకులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయన వెంట మయూరి, హరిత యూనిట్ల మేనేజర్లు పాత్రుడు, దేవుడుబాబు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల సాహసయాత్ర



ఎన్‌సీసీ క్యాంపునకు హాజరైన క్యాడెట్లు



ట్రెక్కింగ్ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

అరకులోయ టౌన్: అరకు నియోజకవర్గ కేంద్రంగా వివిధ రాష్ట్రాల ఎన్‌సీసీ క్యాడెట్లు, ఆర్మీ సిబ్బంది 8 రోజుల సాహసయాత్ర కమాండింగ్ ఆఫీసర్ గోపేంద్ర ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా మంగళవారం ఏపీ, తెలంగాణ, కర్నాటక, గోవా, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన 450 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, 25 మంది ఆర్మీ సిబ్బంది రణజిల్లెడ జలపాతం వద్ద ట్రెక్కింగ్ నిర్వహించారు. ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఏపీ తెలంగాణ డైరెక్టరేట్) వీఎం రెడ్డి శిబిరాన్ని సందర్శించారు. క్యాడెట్లతో మమేకం అయ్యారు. జిల్లాలో ఎన్‌సీసీ క్యాడర్‌ను విస్తరించడమే లక్ష్యంగా కలెక్టర్ దినేష్ కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా సహకరించడం శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు. రాబోయే మూడు రోజుల్లో క్యాడెట్లు ప్రకృతి దృశ్యాలతోపాటు, విశాలమైన లోయలు, నిర్మలమైన ప్రదేశాలను గుర్తించడమే లక్ష్యంగా పనిచేస్తారన్నారు. ఈ నెల 11న సాంస్కృతిక కార్యక్రమంతో శిబిరం ముగుస్తుందని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన క్యాడెట్లు జానపద, సాంస్కృతిక కళలను ప్రదర్శిస్తారన్నారు.



ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న కమాండెంట్



రణజిల్లెడ జలపాతం వద్ద క్యాడెట్లతో కమాండింగ్ అధికారి కల్నల్ గోపేంద్ర



సాహసయాత్రలో సందర్శించాల్సిన ప్రదేశాల చిత్రాలను పరిశీలిస్తున్న కమాండెంట్లు

క్లుప్తంగా

59 ఫోన్లు రికవరీ.. బాధితులకు అందజేత



యువకుడికి ఫోన్‌ను అందజేస్తున్న ఎస్పీ అమిత్‌బర్దర్

పాడేరు: చోరీకి గురైన, పోయిన 59 ఫోన్లను పోలీసులు రికవరీ చేసి, ఎస్పీ అమిత్ బర్దర్ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఫోన్లు పోగొట్టుకున్న హుకుంపేట, అనంతగిరి, చింతపల్లి, పాడేరు, డుంబ్రిగుడ, అరకు, అడ్డతీగల, రంపచోడవరం, మారేడుమిల్లి తదితర మండలాలకు చెందిన వారికి జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎస్పీ అమిత్‌బర్దర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ వినియోగదారులు తమ ఫోన్లను పోగొట్టుకుంటే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పారు. కేసు నమోదు చేసి రికవరీ చేస్తామని తెలిపారు. ఎస్పీ అమిత్ బర్దర్, పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు చేసిన భర్తకు బెదిరింపులు


టిటింగ్‌వలస గ్రామస్తులు, రఘునాథ్ కుటుంబ సభ్యుల ఆందోళన

హుకుంపేట : భార్య కనిపించడం లేదని ఫిర్యాదు చేసిన తనను చంపేస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నట్టు బాధితుడు రఘురాథ్ ఆందోళన వ్యక్తం చేశాడు. మంగళవారం టిటింగ్‌వలస గ్రామానికి చెందిన రఘునాథ్‌తో పాటు కుటుంబ సభ్యులు ఆందోళన నిర్వహించారు. రంగశీల పంచాయతీకి టిటింగ్ వలస గ్రామానికి చెందిన రఘునాథ్, ఉప్పమ్మలకు ఈ ఏడాది మార్చి 3న వివాహం జరిగింది. కొంతకాలం తరువాత ఆమె అదృశ్యమైంది. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. అప్పటి నుంచి తన భార్య కుటుంబ సభ్యులు చంపేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. తమను బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేశారు.

ఇన్‌చార్జుల ఏలు'బడి'లో..!

- మాతృసంస్థకు సమగ్ర శిక్ష ఏపీసీ
- పర్యవేక్షణాధికారులకూ ముగిసిన డిప్యూటేషన్ల గడువు
- రెగ్యులర్ అధికారులు లేక గాడితప్పుతున్న పాలన
- విద్యా కార్యక్రమాలపై పర్యవేక్షణ కరువు
- ఏపీసీ పోస్టు కోసం కూటమి నేతల చుట్టూ ప్రదక్షిణలు


విశాఖలోని సమగ్ర శిక్ష కార్యాలయం

విశాఖ విద్య: జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్(ఏపీసీ)గా పనిచేస్తున్న శ్రీనివాసరావును ఆయన మాతృసంస్థ(పంచాయతీ రాజ్ శాఖ)కు పంపిన ప్రభుత్వం.. ఆ పోస్టులో ఎవరినీ నియమించలేదు. డీఈవో చంద్రకళ ఇన్‌చార్జి ఏపీసీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సమగ్ర శిక్ష కార్యాలయంలోని కొంత మంది సెక్టోరియల్ అధికారుల డిప్యూటేషన్ల గడువు ముగిసింది. వీరిని కొనసాగిస్తారా..? లేదా అనే సందేహాలు ఉన్నాయి. విశాఖపట్నం, భీమునిపట్నం డిప్యూటీ డీఈవో పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి. చినగదిలి ఎంఈవోగా పని చేస్తున్న రవీంద్రబాబు, ఆనందపురం ఎంఈవో–1గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తుండగా.. ఇదే అధికారి విశాఖ, భీమిలి ఇన్‌చార్జి డిప్యూటీ డీఈవోగా కూడా వ్యవహరిస్తున్నారు. ఇలా కీలకమైన పోస్టుల్లో ఇన్‌చార్జులు ఉండటంతో విద్యాశాఖ కార్యక్రమాలపై పర్యవేక్షణ కరువైంది. ఫలితంగా బడుల్లో నాణ్యమైన విద్య దూరమవుతోంది.

'సమగ్ర శిక్ష'కీలకం

పాఠశాల విద్యా కార్యక్రమాల అమలులో సమగ్ర శిక్ష అభియాన్ విభాగం కీలకంగా వ్యవహరిస్తుంది. బడి ఈడు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్య అందించడం, అభ్యసన ఫలితాలు మెరుగుపరచడం, ఉపాధ్యాయులకు వృత్తి నైపుణ్య శిక్షణ అందించడం, ప్రత్యేక అవసరాల పిల్లల కోసం భవిత కేంద్రాల నిర్వహణ, బాలిక విద్య ప్రోత్సహించే క్రమంలో కస్తూర్బా గాంధీ విద్యాలయాల నిర్వహణ, మౌలిక వసతుల కల్పన, పాఠశాలల నిర్వహణ గ్రాంట్లు , విద్యా కానుకల పంపిణీ.. ఇలా సమస్త కార్యక్రమాలను సమగ్ర శిక్ష అధికారులే పర్యవేక్షణ చేయాల్సి ఉంది. వీటికి సంబంధించిన ప్రగతి నివేదకలను ప్రభుత్వానికి ఇదే కార్యాలయం నుంచి పంపించాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం పూర్తిస్థాయి అధికారులు లేకపోవడంతో అంతా స్తబ్దత నెలకొంది.

పునరావాస కేంద్రంగా సమగ్ర శిక్ష

సమగ్ర శిక్ష అభియాన్‌కు శాంక్షన్ పోస్టులు లేకపోవడంతో ఇదో పునరావాస కేంద్రంగా మారింది. డబ్బులతో ముడిపడిన విభాగం కావడంతో వీటిని చూసేందుకని ట్రెజరీ శాఖ నుంచి ఏటీవో హోదా గల ఎం.భారతి డిప్యూటేషన్‌పై ఇక్కడ అడ్మినిస్ట్రేషన్ అధికారి(ఏవో)గా పనిచేస్తున్నారు. ఆమెకు అసిస్టెంట్‌గా జూనియర్ అకౌంట్ ఆఫీసర్ పోస్టులో సీనియర్ అసిస్టెంట్ క్యాడర్ గల ఉద్యోగి ఉంటే సరిపోతుంది. కానీ ఇక్కడ ట్రెజరీ శాఖ నుంచి ఎస్టీవో హోదా గల సోమినాయుడు డిప్యూటేషన్‌పై కొనసాగుతుండటం గమనార్హం. అకడమిక్, గణాంక, జీసీడీవో వంటి జిల్లా స్థాయి పోస్టుల్లో గెజిటెడ్ హోదా గల వారు ఉండాలి. కానీ స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ గల ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. ప్రస్తుతం పని చేస్తున్న వారిని తప్పించి.. ఆ సీట్లను చేజిక్కించుకునేందుకు కొంతమంది ఉపాధ్యాయులు కూటమి నేతలను ప్రసన్నం చేసుకుంటున్నారు. ఇలాంటి పరిణామాలతో సమగ్ర శిక్ష కార్యాలయం కొంత మందికి పునారావస కేంద్రంగా మారిపోతోంది.

ఏపీసీ పోస్టుకు యమ గిరాకీ

విద్యాశాఖ కార్యక్రమాల అమల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి ఏటా జిల్లాకు సుమారుగా రూ.100 కోట్లకు పైగానే నిధులు కేటాయింపులు ఉంటాయి. ఈ ఆర్థిక లావాదేవీలన్నీ సమగ్ర శిక్ష ఏపీసీ అజమాయిషీలోనే సాగుతాయి. చివరకు డీఈవోకు టీ, స్నాక్స్‌కు బడ్జెట్ కావాలన్నా సమగ్ర శిక్ష కార్యాలయం నుంచే విడుదల చేయాలి. ఆర్థిక లావాదేవీలతో ముడిపడింది కావడంతో ఈ పోస్టులోకి వచ్చేందుకు పలువురు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరలోనే ఏపీసీ పోస్టుల భర్తీ ఉంటుందనే ప్రచారం సాగుతుండటంతో.. దీన్ని ఆశిస్తున్న వారంతా కూటమి నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

> **బోధనేతర పనులకు టీచర్లు వద్దు**
>
> విద్యాశాఖలో ఖాళీగా ఉన్న అధికారుల పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా తక్షణమే భర్తీ చేయాలి. సమగ్ర శిక్ష, ఇతర కార్యాలయాల్లో ఉన్న ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను రద్దు చేసి, స్కూళ్లకు పంపించాలి. ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగించవద్దు.
>
> – టి.ఆర్.అంబేడ్కర్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

కేజీబీవీలో నాన్ టీచింగ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు

పాడేరు : ఏపీ సమగ్ర శిక్ష సొసైటీ (పాఠశాల విద్యా శాఖ) ద్వారా నిర్వహిస్తున్న జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 28 నాన్ టీచింగ్ సిబ్బంది పోస్టులను ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరం ఏడాది కాలానికి అర్హత, ఆసక్తి కలిగిన మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. టైప్–3 కేజీబీవీల్లో 25 పోస్టులకు గాను హెడ్‌కుక్–7, అసిస్టెంట్ కుక్–9, డే అండ్ నైట్ వాచ్ ఉమెన్–3, స్కావెంజర్స్–6, స్వీపర్లు–5 ఖాళీలు ఉన్నాయన్నారు. టైప్–4 కేజీబీవీల్లో 3 పోస్టులకు గాను చౌకిధార్–1, హెడ్‌కుక్–1, అసిస్టెంట్ కుక్–1 పోస్టులను భర్తీ చేస్తామన్నారు. హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్, స్కావెంజర్స్, స్వీపర్ పోస్టులకు విద్యార్హత ప్రామాణికం కాదన్నారు. డై అండ్ నైట్ వాచ్ ఉమెన్, చౌకిధార్ పోస్టులకు మాత్రం 7వ తరగతి విద్యార్హత ఉండాలన్నారు. అభ్యర్థుల కనీస వయసు ఓసీ అభ్యర్థులకు జూలై ఒకటి 2024 నాటికి 42ఏళ్లు, ఎక్స్ సర్వీస్ మెన్–45 ఏళ్లు, ఎస్సీ,ఎస్టీ బీసీ, ఈడబ్ల్యూఎస్ వారికి 47 ఏళ్లు, పీహెచ్ వారికి 52 ఏళ్లు నిండి ఉండాలన్నారు. దరఖాస్తులను ఈనెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల్లో ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులను అక్టోబర్ 22 నుంచి విధుల్లోకి తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

గునసెల్మ గిరిజనుల ఆదర్శం

- శ్రమదానంతో రహదారికి మరమ్మతులు

ముంచంగిపుట్టు: రహదారికి శ్రమదానంతో మరమ్మతులు చేపట్టి గునసెల్మ గిరిజనులు ఆదర్శంగా నిలిచారు. మండలంలోని బాబుశాల పంచాయతీ గునసెల్మకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదు. దీంతొ వారే రంగంలోకి దిగారు. మంగళవరం గిరిజనులంతా చేయి చేయి కలిపి శ్రమదానంతో రహదారిని బాగు చేసుకున్నారు. గునసెల్మ నుంచి గాదెలపుట్టు వరకు రెండు కిలోమీటర్ల పొడవునా మట్టిరోడ్డులో గుంతలను పూడ్చారు. ఈ సందర్భంగా గ్రామ గిరిజనులు కృష్ణారావు, అద్దు, సోమన్న, గోపాల్‌స్వామి, గంగాధర్, విజయ్‌కుమార్ మాట్లాడుతూ రహదారి బాగులేక చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. వర్షాకాలంలో అత్యవసర పరిస్థితిలో రోగులను ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు సమస్యలు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పక్కా రహదారి నిర్మించాలని వారు కోరారు.

కేజీబీవీల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు

విశాఖ విద్య: జిల్లాలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో వంట మనిషి, వాచ్‌మెన్, చౌకీదార్ పోస్టులను ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేస్తున్నట్లు డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఆనందపురం, భీమునిపట్నం, పద్మనాభం, రెడ్డిపల్లి అగ్రహారం కేజీబీవీల్లో ఈ పోస్టులు ఉన్నాయన్నారు. ఈ నెల 15లోపు ఆయా మండలాల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎయిర్‌పోర్టులో ఈవీ చార్జింగ్ స్టేషన్


ఈవీ చార్జింగ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి

గోపాలపట్నం(విశాఖ): విశాఖ విమానాశ్రయంలో ఎలక్ట్రిక్ వాహనాలకు ఉచితంగా చార్జింగ్ చేసుకునే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఎయిర్‌పోర్టులో 3వ లైన్‌లో ఈ ఉచిత చార్జింగ్ స్టేషన్‌ను డైరెక్టర్ రాజారెడ్డి మంగళవారం ప్రారంభించారు. వెయిటింగ్ సమయంలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

విశాఖ–రాయపూర్ పాసింజర్ వేళల్లో మార్పులు

తాటిచెట్లపాలెం(విశాఖ): విశాఖపట్నం–రాయ్‌పూర్ పాసింజర్ వేళల్లో మార్పులు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం–రాయ్‌పూర్(08528) పాసింజర్ స్పెషల్ ఈనెల 20 నుంచి ఉదయం 4.25 గంటలకు బదులుగా ఉదయం 6.30 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి, అదేరోజు రాత్రి 7.45 గంటలకు రాయ్‌పూర్ చేరుకుంటుంది.

విజయలక్ష్మిగా కనకమహాలక్ష్మి


గులాబీపూల పూజలో విజయలక్ష్మిగా సిరులతల్లి

డాబాగార్డెన్స్: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం కనకమహాలక్ష్మి అమ్మవారు విజయలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి గులాబీపూలతో పూజ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. బుధవారం విద్యాలక్ష్మిగా అమ్మవారు దర్శనమివ్వనున్నారని ఈవో శోభారాణి తెలిపారు.

సింహగిరిపై నేడు ఆయుధపూజ


అప్పన్న ఆయుధాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న విజయదశమి మహోత్సవాల్లో భాగంగా మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయుధ పూజ నిర్వహించనున్నారు. ఆలయంలో కొలువైన సింహవల్లీ తాయారు సన్నిధిలో ఉదయం స్వామి ఆయుధాలైన కత్తి, ధనస్సు, బాణం, బాకు తదితర వాటిని ఉంచి పూజ చేస్తారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో విజయదశమి రోజు వరకు ఈ ఆయుధాలు ఉంచనున్నారు. ఈ మేరకు ఆలయ వైదిక, అధికారులు ఏర్పాట్లు చేశారు.

రైల్వే ప్రయాణికుల భద్రతకు చర్యలు

తాటిచెట్లపాలెం(విశాఖ): పండగ నేపథ్యంలో రైల్వే ప్రయాణికుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామని.. పలు రైళ్లకు అదనపు కోచ్‌లు జత చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక టికెట్ కౌంటర్లు, క్యూ ఆర్ కోడ్ ఆధారిత టికెట్లు, ఏటీవీఎం, వైటీఎస్‌కే వంటి అదనపు వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రయాణికుల కూడా సంబంధిత అధికారులు, రైల్వే సూచనలు పాటించాలని సూచించారు. సరైన టికెట్లు లేకుండా రిజర్వేషన్ బోగీల్లో ప్రయాణించరాదని, నిషేధిత వస్తువులను తీసుకు వెళ్లరాదన్నారు. ఇటువంటివి ఏమైనా తోటి ప్రయాణికులు గమనిస్తే వెంటనే రైల్వే అధికారులకు తెలియజేయాలని కోరారు.

'విద్యుత్ ఉచ్చు' కేసులో ముగ్గురి అరెస్టు

- వ్యక్తి మృతికి కారణమైన నిందితులకు రిమాండ్
- సీఐ నర్సింహమూర్తి, ఎస్ఐ రామకృష్ణ వెల్లడి

వై.రామవరం: విద్యుత్ ఉచ్చుతో వన్యప్రాణుల వేట కేసులో వ్యక్తి మృతికి కారణమైన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి సీఐ నర్సింహమూర్తి, ఎస్ఐ బి.రామకృష్ణ మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దేవరమడుగులు గ్రామానికి చెందిన పాత్తూరి పండయ్య(40), పాత్తూరి కృష్ణా రెడ్డి(49), కిమ్ముడు బాలురెడ్డి(35) గత నెల 5వ తేదీ రాత్రి సమీప నూతిమెట్ట కొండపై అడవి జంతువులను వేటాడేందుకు విద్యుత్ ఉచ్చును అమర్చారు. అదే కొండపైకి పక్షుల వేటకు బయలుదేరిన లోత సూరిరెడ్డి విద్యుత్ ఉచ్చు తీగలు తగలడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. మరుసటి రోజు ఉదయం నిందితులు ముగ్గురు విద్యుత్‌ఉచ్చును తొలగించారు. సూరిరెడ్డి మృతదేహాన్ని మెట్టపైకి తీసుకువెళ్లి రాళ్లతో పూడ్చేశారు. ఇంటినుంచి వెళ్లిన భర్త (సూరిరెడ్డి) తిరిగి రాకపోవడంతో కంగారుపడిన భార్య లోత వెంకటలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్త ఆచూకీ కోసం గ్రామస్తుల సాయంతో వెతుకుతుండగా గత నెల 10వ తేదీన మెట్టపై రాళ్ల మధ్యలో సూరిరెడ్డి మృతదేహాన్ని గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విద్యుత్ ఉచ్చు వల్లే చనిపోయినట్టుగా గుర్తించారు. ఉచ్చును అమర్చిన పాత్తూరి పండయ్య, పాత్తూరి కృష్ణా రెడ్డి, కిమ్ముడు బాలురెడ్డిలను అదుపులోకి తీసుకుని విచారించారు. వారు నేరం అంగీకరించడంతో సోమవారం రాత్రి అరెస్టు చేసి అడ్డతీగల కోర్టులో హాజరుపరిచారు. నిందితులు ముగ్గురికి న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు సీఐ, ఎస్ఐలు తెలిపారు.

కాఫీ రైతుల సంక్షేమమే లక్ష్యం

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్


సమావేశంలో పాల్గొన్న అధికారులు

చింతపల్లి: కాఫీ రైతులు సంక్షేమమే లక్ష్యమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ అన్నారు. మంగళవారం స్థానిక కాఫీ ఎకో పల్పింగ్ యూనిట్ సమావేశ మందిరంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, హార్టికల్చర్ కన్సల్టెంట్లు, ఫీల్డ్‌కన్సల్టెంట్లు, చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాల లైజన్ వర్కర్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 నవంబర్ నుంచి కాఫీ పండ్ల సేకరణ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. నాణ్యమైన పండ్లను మాత్రమే సేకరించాలని సూచించారు. రెండు వేల టన్నుల సేకరణ లక్ష్యమన్నారు. గతేడాది 836 టన్నుల కాఫీ పండ్లను సేకరించగా, రైతులకు కిలో రూ.43 చొప్పున ధర చెల్లించామన్నారు. దానికి అదనంగా కిలోకు రూ.3 చొప్పున బోనస్‌గా చెల్లిస్తున్నామని తెలిపారు. గత ఏడాది 189 మెట్రిక్ టన్నుల పార్చ్‌మెంట్, 33 టన్నుల చెర్రీ ఉత్పత్తి జరిగిందన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 6,500 కాఫీ రైతులను గుర్తించినట్టు చెప్పారు. అనంతగిరి మండలం నుంచి 50 టన్నులు, అరకు లోయ, డుంబ్రిగుడ నుంచి 120 టన్నులు, హుకుంపేట నుంచి 200, పెదబయిలు నుంచి 120, ముంచింగిపుట్టులో 100, పాడేరులో 120, జిమాడుగులలో 350, చింతపల్లిలో 400 మెట్రిక్ టన్నుల కాఫీ పండ్లను సేకరించాలని ఆదేశించారు. ఎపెక్స్ కమిటీ నిర్ణయం మేరకు ఏడాది కాఫీ ధర నిర్ణయిస్తామని చెప్పారు. కాఫీ అధికారుల పనితీరును ఆయన ప్రశంసించారు. ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వర రావు, కాఫీ సహాయ సంచాలకులు అశోక్, మ్యాక్స్ సొసైటీ అధ్యక్షుడు కొండలరావు, ఉపాధ్యక్షుడు సింహాచలం, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాల లైజన్ వర్కర్లు పాల్గొన్నారు.

14 నుంచి పల్లెపండగ


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో ఈనెల 14 నుంచి పల్లెపండగ కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పలుశాఖల అధికారులతో మంగళవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 23న ఒకే రోజు జిల్లాలోని అన్ని పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో తీర్మానించిన పనులను ప్రారంభించేందుకు పల్లెపండగ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. రూ.275 కోట్ల వేజ్ కాంపొనెంట్, మరో రూ.185కోట్లు మెటీరియల్ కాంపొనెంట్ కింద పనులను ప్రతిపాదించినట్టు చెప్పారు. పల్లెపండగలో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు.

జాబ్‌కార్డుల తొలగింపుపై కలెక్టర్ ఆగ్రహం

ఉపాధి హామీ పథకం పనులను సమీక్షించిన కలెక్టర్ చింతపల్లి మండలంలో పనులు తక్కువగా జరగడంపై ఆరా తీశారు.ఒక పంచాయతీలో 1329 మంది జాబ్‌కార్డులను తొలగించడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.పోలీసు కేసు పెట్టినా ఇంతవరకు విచారణ పూర్తికాని విషయాన్ని కలెక్టర్ తెలుసుకున్నారు. లాగిన్,పాస్‌వర్డ్‌లు ఇతరులకు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ ఎంపీడీవోకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు.ఎంపీడీవో తప్పిదం ఉంటే సస్పెండ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.అనంతరం ఆహార భద్రతపై సమీక్షించారు.జిల్లాలో 10లక్షల జనాభా సంతల్లో దొరికే వస్తువులను కొనుగోలు చేసి, వాటితో తయారు చేసిన ఆహారం తింటున్నారని, అలాగే లక్షకు పైగా విద్యార్థులు విద్యాసంస్థల్లో తింటున్నారని, ఆ ఆహారంపై తనిఖీలు చేపట్టి ల్యాబ్‌లకు పంపాలని ఆదేశించారు. అనంతరం జిల్లాలో పలు పథకాల ద్వారా చేపట్టనున్న ఇళ్ల నిర్మాణాలతో పాటు,గ్రామ సచివాలయాల సేవలపై సమీక్షించారు.సచివాలయాల్లో విధులకు హాజరుకాని ఉద్యోగుల వివరాలను సేకరించి ట్రెజరీలకు పంపి జీతాలు నిలిపివేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జేసీ అభిషేక్‌గౌడ, డ్వామా పీడీ శివయ్య, డీపీవో కొండలరావు, డీఎల్‌పీవో కుమార్, హౌసింగ్ పీడీ బాబు, పౌరసరఫరాల శాఖ డీఎం గణేష్‌కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు,మార్కెటింగ్ ఏడీ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

తుమ్మపాల: జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. సాగునీటి సంఘాల ఎన్నికల ఏర్పాట్లపై జల వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా నుంచి కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. ఓటరు జాబితాను సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూ, సాగునీటి పారుదల శాఖ అధికారులు సమన్వయంతో నియమ, నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు షేక్ అయిషా, వి.వి.రమణ, నీటి పారుదల శాఖ ఈఈ ఎ.త్రినాథ్, డీఈలు, ఏఈలు, పాల్గొన్నారు.

సప్పరం వాహనంపై ఊరేగిన వెంకన్న


సప్పరం వాహనంపై స్వామివారి తిరువీధి సేవ నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా ఉపమాక వెంకన్న ఆలయంలో మంగళవారం సప్పరం వాహనంలో స్వామి వారికి తిరువీధి సేవలు నిర్వహించారు. ముందుగా గరుడాద్రిపై ఉన్న స్వామి వారికి నిత్యార్చణలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు అర్చనలు పూర్తి చేశారు. తదుపరి ఉభయ దేవేరులతో కూడిన స్వామి వారిని సప్పరం వాహనంలో ఉంచి మాడ వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం సేవల్లో భాగంగా నిత్య కార్యక్రమం పూర్తి చేసి తిరువీధి సేవ నిర్వహించారు. బుధవారం స్వామివారికి గరుడ వాహనంపై తిరువీధి సేవ, వినోదోత్సవం జరుగుతాయని అర్చకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో టీవీఎస్ ఉద్యోగి దుర్మరణం


ఘటన స్థలంలో రాంబాబు మృతదేహం

తగరపువలస(విశాఖ): భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ సిటీనగర్ వద్ద యూనియన్ బ్యాంకు ఎదురుగా మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో శెట్టి రాంబాబు అనే దివీస్ ఉద్యోగి దుర్మరణం చెందాడు. నైట్ డ్యూటీకి వెళ్లిన రాంబాబు విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ముందున్న ట్రాక్టర్‌ను దాటి వెళ్లే ప్రయత్నం చేశాడు. ఇంతలో ఎదురుగా లారీ వస్తుండటంతో వెనక్కు తగ్గే క్రమంలో ట్రాక్టర్ వెనుక భాగం బలంగా తగిలి రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్ర రక్తస్రావం కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన మృతుడు ఏడేళ్ల క్రితం దివీస్‌లో చేరాడు. ప్రస్తుతం జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బాలాజీనగర్‌లో నివసిస్తున్నాడు. అతనికి భార్య, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. భీమిలి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఆయన స్వగ్రామానికి తరలించారు. అతని మృతితో తోటి ఉద్యోగులు దుఃఖంలో మునిగిపోయారు.


రాంబాబు(ఫైల్)